క్లుప్తంగా

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి



కేజీబీవీలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ

తిరుమలగిరి : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడానికి మెస్ ఛార్జీలను పెంచిందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఆమె వెంట ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నిలిచిన షాదీఖాన భవన నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న షాదీఖాన భవనం

అర్వపల్లి : అర్వపల్లి శివారులోని హజ్రత్‌ఖాజా నసీరుద్దీన్ బాబా దర్గా వద్ద 15ఏళ్ల కిందట మొదలైన షాదీఖాన నిర్మాణ పనులు నిధులలేమితో అసంపూర్తిగా నిలిచిపోయాయి. మైనార్టీల కోసం ప్రత్యేకంగా అప్పట్లో ఈ షాదీఖాన నిర్మాణాన్ని ప్రారంభించారు. సకాలంలో నిధులు మంజూరు కాక ఇంత వరకు పనులు పూర్తి కాలేదు. దీంతో నిర్మించిన భవనం పనులు పూర్తి కాకముందే శిథిలమవుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పనులను పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ముస్లిం నాయకులు కోరుతున్నారు.

ఇసుక రీచ్‌ల పరిశీలన



పాలేరు వాగును పరిశీలిస్తున్న మైనింగ్, జలవనరుల, రెవెన్యూ శాఖ అధికారులు

మద్దిరాల : ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ఇసుక పాలసీలో భాగంగా మండలంలోని ముకుందాపురం, జి.కొత్తపల్లి, పిర్యానాయక్ తండాల పరిధిలోని పాలేరువాగు సమీపంలో గల ఇసుక రీచ్‌లను జలవనరుల, మైనింగ్ శాఖ అధికారులతో కలిసి తహసీల్దార్ అమీన్ సింగ్ బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇసుక పాలసీ ద్వారా నూతనంగా ఇళ్లు నిర్మించుకోనే వారికి చక్కటి అవకాశం అని అన్నారు. ఇసుక పాలసీ కొరకు ట్రాక్టర్ యజమానులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వారి వెంట ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరు మండలాలకు అంబులెన్స్‌లు మంజూరు

అర్వపల్లి : ఆపదలో ఉన్న వారికి సకాలంలో వైద్యసేవలందించడానికి గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన 108 అంబులెన్స్‌లను ప్రవేశపెట్టారు. అయితే ఇప్పటి వరకు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు ఒకే అంబులెన్స్ ఉంది. ఆ అంబులెన్స్ అర్వపల్లి కేంద్రంగా పనిచేస్తూ అన్ని మండలాలకు సేవలందించేంది. అయితే ఆయా మండలాలకు సకాలంలో చేరుకోలేకపోతుండడంతో తాజాగా ప్రభుత్వం మరో 5కొత్త అంబులెన్స్‌లను ఆయా మండలాలకు మంజూరు చేసింది. దీంతో ఆరు మండలాలకు 6 అంబులెన్స్‌లు ఏర్పాటయ్యాయి.

ఘనంగా ఇరుముడి మహోత్సవం



ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న మాలధారులు, నాయకులు

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామ శివాలయంలో అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులు అయ్యప్పను స్మరిస్తూ హోమం, అభిషేకం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వల్లాల భానుప్రకాష్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడి కట్టుకొని శబరిమలైకి బయలుదేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ తండు శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ నాతి పద్మ వీరమల్లుగౌడ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆలకుంట్ల బాలకృష్ణ, ఆలయ చైర్మన్ లక్ష్మీకాంత్, పెరమండ్ల జాన్‌వెస్లీ, జంగిలి ఉపేందర్, వల్లాల రామయ్య, వెంకన్న, రామయ్య, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

పొగమంచులో లైట్లతో ప్రయాణించాలి

- జిల్లా రవాణా శాఖ అధికారి సురేష్‌రెడ్డి సూచన



సూర్యాపేట టౌన్: జిల్లాలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతుండడంతో జనాలు అల్లాడిపోతున్నారు. రాత్రిపూట చల్లటి గాలులు వీస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు పొగమంచులో లైట్లతో ప్రయాణించాలని నిపుణులు చెబుతున్నారు.

- అత్యవసర ప్రయాణం అయితే తగిన జాగ్రత్తలు పాటించాలి.
- ఈ సీజన్‌లో చలితో పాటు మంచు ప్రభావం ఎక్కువ.
- ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఉంటుంది. కాబట్టి ఫాగింగ్ లైట్లు వేసుకోవాలి.
- ఇండికేటర్లను ఉపయోగించాలి.
- కారుకు ఖచ్చితంగా వైపర్ ఉందా లేదా చూసుకోవాలి.
- ద్విచక్రవాహనదారులు తమ బైక్‌కు టైర్లు గ్రిప్స్ ఉండేలా చూసుకోవాలి.
- వాహనదారులు మంచు వచ్చే సమయంలో నెమ్మదిగా వెళ్లడం ఉత్తమం.
- కారులో వెళ్లేవారు లైట్లను ఆన్ చేసి ప్రయాణించాలి.
- కార్లలో వెళ్లే వారు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలి.
- ద్విచక్ర వాహనదారులు ఇండికేటర్ లైట్లు, హెడ్ లైట్లను ఆన్‌లో ఉంచుకుని ప్రయాణం చేయాలి.



– సురేష్‌రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి, సూర్యాపేట

అధిక చలికి జాగ్రత్తలు ఇవీ..

కంప్యూటర్లను జాగ్రత్తగా వాడుకోవాలి

- కంప్యూటర్ టెక్నీషియన్ ఆనంద్ సలహా



భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. చలికాలంలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో కంప్యూటర్లు త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది. చలికాలంలో కంప్యూటర్లను ఏవిధంగా వినియోగించాలనే దానిపై నిపుణుల సూచనలు..

- చలి కాలంలో కంప్యూటర్, టీవీలు, సెల్‌ఫోన్లు జాగ్రత్తగా వినియోగించాలి.
- ఎలక్ట్రానిక్ పరికరాలు అతి వేడికి, అతి చల్లదనానికి ప్రమాదకరంగా మారుతాయి. అతి వేడితో, అతి చల్లదనం దగ్గర మదర్ బోర్డులోని కాంపోనెంట్స్ ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ వర్కింగ్ ప్రాసెస్ ప్రాపర్‌గా ఉండదు.
- అతి చల్లదనంతో ప్రధానంగా ఎలక్ట్రానిక్ పరికరాలు ఇంటర్నల్ కాంపోనెంట్స్ వర్కింగ్ కండిషన్ కోల్పోతాయి. మదర్ బోర్డులో ఉండే డేటా పోయే అవకాశం ఉంది.
- శీతాకాలంలో కంప్యూటర్స్‌ను రెగ్యులర్‌గా వాడడం కాని, గది ఉష్ణోగ్రతకు దగ్గర్లో ఉండే ప్రదేశాల్లో ఉంచడం మంచిది.



ఆనంద్

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం



నాగారం : సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రఘువీర్‌రెడ్డి



తిరుమలగిరి : మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్

నాగారం : నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని, అందుకోసం గ్రామాల్లో ఏర్పాటు చేసుకోవాలని నాగారం సర్కిల్ సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుపై వ్యాపారులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించి మాట్లాడారు. నేరాల నియంత్రణలో నిఘా నేత్రాల పాత్ర కీలకమన్నారు. గ్రామాలలో నిఘా నేత్రాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. నిఘా నేత్రాలు ఏర్పాటుకు గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం.ఐలయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ సురేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఇంటి యజమానులు, దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో పలువురు పట్టణ ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి అభివృద్ధిని విస్మరిస్తున్న ఎమ్మెల్యే



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

తుంగతుర్తి : తుంగతుర్తి మండల అభివృద్ధిని ఎమ్మెల్యే మందుల సామేల్ విస్మరిస్తున్నారని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు తడకమళ్ల రవికుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మందుల సామేల్ తుంగతుర్తి నియోజకవర్గం అంటే మోత్కూర్, శాలిగౌరారం, అడ్డగూడూరు మండలాలు మాత్రమే అనుకుంటున్నారని, గ్రామపంచాయతీలకు రూరల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద నియోజకవర్గానికి రూ.15కోట్లు మంజూరైతే వాటిని అడ్డగూడూరు మండలానికి రూ.9కోట్లు, శాలిగౌరారం మండలానికి రూ.6కోట్లు కేటాయించారని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చాల్సింది పోయి మోత్కూరును రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని అసెంబ్లీలో సామేల్ చెప్పడం విచారకరమన్నారు. ఆయన వెంట నాయకులు బొంకూరి మల్లేష్, బొంకూరి మధు, బొజ్జ సాయికిరణ్, వెంకటేష్, సురేష్, మధు, బొంకూరి బాలకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్రగా మాలధారులు



మాలధారుల పాదయాత్రను ప్రారంభిస్తున్న కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట : పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం గోవింద మాలధారులకు ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మాలధారులు తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ పాదయాత్రను పీసీసీ సభ్యుడు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి ప్రారంభించారు. ఈ ఇరుముడి కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు అన్నమయ్య రాము, కోడి శివ యాదవ్ హాజరై మాట్లాడారు. గోవింద మాలధారులు 21రోజులు పూజలు చేసి 20రోజుల పాటు 600కిలోమీటర్లు పాదయాత్రగా తిరుమల తిరుపతి దేవస్థానానికి చేరుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ చెంచల శ్రీనివాస్, పందిరి మల్లేష్, ఆలేటి మాణిక్యం, మధు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐది ఘనమైన చరిత్ర



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భానుపురి (సూర్యాపేట) : భారతదేశంలో సీపీఐ పార్టీకి ఘనమైన చరిత్ర ఉందని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో దంతాల రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన పట్టణ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆనాటి నుంచి నేటి వరకు ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన ఘనత పార్టీకి ఉందన్నారు. ఈనెల 26నాటికి పార్టీ పుట్టి 100సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 30న నల్లగొండలో ఉమ్మడి జిల్లా భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు, ఈ సభకు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పట్టణ కార్యవర్గ సభ్యులు దోరెపల్లి శంకర్, చామల అశోక్ కుమార్, చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము, జి.రాజారామ్, పట్టణ కౌన్సిల్ సభ్యులు ఎండీ పాషా, పెండ్ర కృష్ణ, ఏడెల్లి శ్రీకాంత్, వాడపల్లి వెంకన్న, వాడపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి స్రవంతి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దోసపహాడ్‌లో గల మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి స్రవంతి మాట్లాడుతూ.. విద్యార్థినులు వసతిగృహంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దీంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉంటాయని ఆమె తెలిపారు. ప్రతి నెలా వసతిగృహంలోని విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 78మంది విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అనూష, హెచ్‌ఈఓ చంద్రశేఖర్‌రాజు, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ప్రిన్సిపల్ ఆదిలక్ష్మి, ఆశాలు ఉపేంద్ర, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి వివిధ కమిటీల్లో స్థానం కల్పించడంపై హర్షం

అర్వపల్లి : భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి వివిధ కమిటీలలో కేంద్రం స్థానం కల్పించడం పట్ల రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు బోయలపల్లి రేఖ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎంపీగా గెలిచి నిత్యం ప్రజలలో ఉంటూ పార్లమెంట్ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరిస్తున్నారని అన్నారు. ఇక్కడి సమస్యలను ఎప్పటికప్పుడు పార్లమెంట్‌లో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా, పార్లమెంట్ స్థాయి హౌసింగ్, పట్టణ విభాగం స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా, బీబీనగర్ ఎయిమ్స్ పాలక మండలి సభ్యుడిగా కేంద్రం నియమించడం హర్షణీయమన్నారు.

బాలయ్య మృతికి సంతాపం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రింగు బాలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఆ పార్టీ జిల్లా, బ్లాక్, మండల నాయకులు వేర్వేరుగా నివాళులర్పించారు. వారిలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్ రెడ్డి, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు కృష్ణమూర్తి ఉన్నారు.

రావుల అంజయ్యకు నివాళి

మండల పరిధిలోని వేల్పుచర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రావుల అంజయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్‌రెడ్డి నివాళులర్పించారు.

గోదాదేవికి కుంకుమార్చన

అర్వపల్లి : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో భక్తులు బుధవారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గోదాదేవికి కుంకుమార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే మూడవ పాశురాన్ని పఠించారు. కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, గుడిపల్లి సులోచన, ఎం.కవిత, ఎస్.మంజుల, స్వరూప, జయమ్మ, జానకమ్మ, సదాలక్ష్మి, రవి పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



దుస్తులు పంపిణీ చేస్తున్న హైకోర్టు జడ్జి జాకబ్ మోడి

తిరుమలగిరి : మండల కేంద్రంలోని కవనెంట్ చర్చిలో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం 200మందికి హైకోర్టు జడ్జి జాకబ్ మోడి దుస్తులను, బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. క్రీస్తు ప్రేమను ప్రతిఒక్కరూ కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ చారిటీ ట్రస్ట్ ఫౌండర్ ఇరుగు శ్యామ్‌సన్, జాన్‌వెస్లీ, రెవరెండ్ పురుషోత్తం, కందుకూరి లక్ష్మయ్య, అజయ్, నాగరాజు, రవీందర్, లింగయ్య, కిరణ్‌పాల్, భద్రుపాల్ నాయక్, పృథ్వీరాజ్, నరేష్, నవీన్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మద్దిరాల : నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా ఉండాలన్నారు. సమావేశంలో మండల కమిటీ సభ్యుడు కల్లెపల్లి భాస్కర్, నాయకులు పాతూరి మల్లారెడ్డి, చిదిరాల నారాయణరెడ్డి, దీకొండ రంగయ్య, మల్లారెడ్డి, మీనయ్య, మోష పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడల్లో ప్రథమ బహుమతి

తుంగతుర్తి : సూర్యాపేటలో జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడల్లో కబడ్డీ విభాగంలో తుంగతుర్తిలోని మైనార్టీ బాలుర గురుకుల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఉమారెడ్డి విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు మహేష్‌ను అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బుధవారం మండల పంచాయతీ అధికారి టి.గోపి పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 1400 ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తయిందని, ఇంకా 9వేల ఇళ్ల సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

నూతనకల్ : మండల కేంద్రానికి చెందిన బొడ్డుపల్లి లక్ష్మయ్య ఇటీవల మృతి చెందాడు. బుధవారం మృతుడి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు దేవిరెడ్డి నర్సిరెడ్డి పరామర్శించి 50కేజీల బియ్యం అందజేశారు. ఆయన వెంట పార్టీ జూలూరి కేశవచారి, శ్రీకాంత్, వెంకటేష్, ముత్తయ్య, శ్రీను ఉన్నారు.

నారాయణ విద్యాసంస్థలను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సింహాద్రి

భానుపురి (సూర్యాపేట): వరుసగా విద్యార్థుల ఆత్మహత్యలకు కారణం అవుతున్న నారాయణ విద్యా సంస్థలను రాష్ట్ర వ్యాప్తంగా రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని చంద్రా పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయంగా నారాయణ విద్యాసంస్థలు మారాయన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులే లక్ష్యంగా చేసుకొని రూ.లక్షలు దండుకుంటున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మహేష్, నవీన్, పవన్, వినయ్, ప్రవీణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే సామేల్



నూతనకల్ : సమావేశంలో మాట్లాడుతున్న పాల్వాయి నాగరాజు

నూతనకల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో వందల కోట్ల నిధులతో అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న నియోజకవర్గ ప్రదాత ఎమ్మెల్యే మందుల సామేల్ అని కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యమకారుడు స్థానికుడు కావడంతో నియోజకవర్గంలోని పల్లెల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతూ సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.1200కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత ఎమ్మెల్యేదేనని అన్నారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, జూనియర్, ఐటీఐ కళాశాలలు, సబ్‌స్టేషన్ నిర్మాణం, బస్‌డిపో ఏర్పాటు, సీసీరోడ్లు, చెక్ డ్యామ్‌లతో పాటు మృతి చెందిన పశువుల రైతులకు నష్టపరిహారం అందించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఇరుగు కిరణ్, గంగరాజు, శ్రీకాంత్, నవీన్ ఉన్నారు.

సమస్యలను లేవనెత్తడం హర్షణీయం

తుంగతుర్తి : నియోజకవర్గంలోని సమస్యలను ఎమ్మెల్యే మందుల సామేల్ అసెంబ్లీలో సభ దృష్టికి తీసుకెళ్లడం హర్షణీయమని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చింతకుంట్ల వెంకన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తిలో ఏర్పాటు చేస్తున్న 100పడకల ఆస్పత్రికి, మోత్కూర్‌లో నిర్మిస్తున్న 30పడకల ఆస్పత్రి నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరడం అభినందనీయమన్నారు.

వీరారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలి



సభ కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నాగారం : మండల కేంద్రంలో ఈనెల 31న జరిగే యానాల వీరారెడ్డి 34వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వీరారెడ్డి స్మారక స్థూపం వద్ద సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బుధవారం వీరారెడ్డి వర్ధంతి సభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. వర్ధమానుకోట గ్రామానికి చెందిన యానాల వీరారెడ్డి విద్యార్థి దశ నుంచే దోపిడీ అసమానతలకు వ్యతిరేకంగా, పీడిత, తాడిత ప్రజల విముక్తి కోసం, భూమికోసం, భుక్తికోసం, పేద ప్రజల విముక్తి కోసం పోరాడిన మహానీయుడని కొనియాడారు. వీరారెడ్డి పార్టీ పిలుపు మేరకు గిరిజనులతో మమేకమై విప్లవోద్యమాన్ని నడిపి కూలీరెట్లు, గిట్టుబాటు ధరలు, సారా వ్యతిరేక ఉద్యమాలు చేపట్టారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపేట కాశయ్య, జిల్లా నాయకులు జాజుల సామేలు, బొమ్మగాని జానీ, బుర్ర ఎల్లయ్య, ఆకుల సుభాష్, బొడ్డుపల్లి అనిల్, రమేష్, పరుశరాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నీటిని వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నాగారం : యాసంగి పంటలకు ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడియం కుమార్, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దేవరకొండ యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశం వారు పాల్గొని మాట్లాడారు. యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వరిసాగు కోసం రైతులు ఇప్పటికే పొలాలను చదును చేయడం, నారు పోయడం లాంటి పనులు చేస్తున్నారని, నాట్లు వేసుకోవడానికి నీటి కోసం రైతులు ఎదురుచూస్తున్నారని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి వరిసాగుకు ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీటి విడుదల చేయాలని కోరారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యులు గుడిపురి వెంకటేశ్వర్లు, కండే భిక్షం, మొల్కపురి మహేందర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు!

- 9ఏళ్ల క్రితం రూ.1.55కోట్లతో నిర్మించిన వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డు
- నేటికీ ప్రారంభానికి నోచుకోని వైనం



నిరుపయోగంగా ఉన్న జాజిరెడ్డిగూడెం వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డు



సీసీ లేక చెత్తాచెదారంతో ఉన్న ఆవరణ

అర్వపల్లి : రైతుల సంక్షేమం కోసం జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో హైవే వెంట నిర్మించిన వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డు నిరుపయోగంగా మారింది. ఈ యార్డు నిర్మాణం జరిగి 9ఏళ్లు కావస్తున్నా ఇప్పటికీ క్రయవిక్రయాలు మొదలుకా లేదు. దీనికి తోడు యార్డులో పూర్తి స్థాయిలో అన్ని సౌకర్యాలు కల్పించకపోవడం సమస్యగా మారింది. 2015–16లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖ సలహాదారు, గ్రామ వాసి రామరాజు విద్యాసాగర్‌రావు కోరిక మేరకు ప్రభుత్వం మండల కేంద్రంలో 4ఎకరాల స్థలంలో వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డును రూ.1.55కోట్లతో నిర్మించి ప్రారంభించకుండానే వదిలేశారు. అయితే ఈ యార్డులో అన్ని వసతులు కల్పించకపోవడంతో ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారింది.

యార్డులో చేపట్టాల్సిన పనులు..

ఈ యార్డులో ప్రస్తుతం ఒక్క షెడ్ మాత్రమే నిర్మాణం జరిగింది. అదనంగా షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అలాగే యార్డు స్థలంలో సీసీ నిర్మాణాలు లేకపోవడంతో వర్షపు వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అదే విధంగా యార్డులో విద్యుత్, నీటివసతి, టాయిలెట్లను వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది. కాగా కేవలం ప్రతి పంట సీజన్‌లో ఈ యార్డును ధాన్యం కొనుగోలు కేంద్రంగా మాత్రమే వాడుకుంటున్నారు. మిగిలిన సమయాల్లో యార్డు నిరుపయోగంగా ఉంటుంది. గతంలో తిరుమలగిరి మార్కెట్ ఆధ్వర్యంలో ఇక్కడి సబ్‌మార్కెట్‌యార్డులో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. రెగ్యులర్ మార్కెట్‌గా మార్చడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు అప్పట్లో అధికారులు ప్రకటించారు. కాని ఇంతవరకు ఆ ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ మార్కెట్‌లో అదనంగా షెడ్లు నిర్మించి, మౌలిక వసతులు కల్పించి రెగ్యులర్ వ్యవసాయ మార్కెట్ యార్డుగా మార్చాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



జాజిరెడ్డిగూడెంలో నిర్మించిన సబ్‌మార్కెట్‌యార్డు ఇంత వరకు ప్రారంభానికి నోచుకోలేదు. యార్డులో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు మార్కెట్‌ను అభివృద్ధి చేసి ప్రారంభించి వినియోగంలోకి తేవాలి.

– చొల్లేటి రమణ, జేఏసీ కన్వీనర్

అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం



గ్రామంలో నిర్మించిన వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో సమస్యలు పరిష్కరించి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ సమస్యలను తీర్చి రెగ్యులర్ మార్కెట్‌గా మారిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– బింగి కృష్ణమూర్తి, గ్రామస్తుడు